క్లుప్తంగా

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

వెదురుకుప్పం: మండలంలో ఉప ముఖ్యమంత్రి కే.నారాయణస్వామి శుక్రవారం పర్యటిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మాంబేడు గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్ కేంద్రాన్ని శుక్రవారం ఉదయం 9.30 గంటలకు మంత్రి ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే 10.30 గంటలకు వెదురుకుప్పంలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీలో పాల్గొంటారన్నారు.

పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి మండలంలో పర్యటించనున్నట్లు మండల కన్వీనర్ విజకుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 2 గంటలకు పండుగ వాతావరణంలో నిర్వహించే పెంచిన పింఛన్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి పాల్గొంటారన్నారు. సీఎం వైఎస్ జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని అన్నారు.

అన్నదానం

నగరి: స్థానిక ఓంశక్తి ఆలయంలో శక్తిమాల ఇరుముడి యాత్ర సందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. శక్తిమాల ధరించిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 18 మంది వృద్ధులకు వస్త్రదానం చేశారు. ఉభయదారులకు ఆలయ మర్యాదలు చేశారు.

ఫ్రిడ్జ్ వితరణ



ఫ్రిడ్జ్‌ను అందిస్తున్న దాత శ్రీధర్

గంగాధర నెల్లూరు: కేశవ రెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జీడీ నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి ట్రస్టు చైర్మన్ శ్రీధర్ రూ.16000 వేల విలువ గల ఫ్రిడ్జ్ వితరణ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో సూది మందు నిల్వ చేసుకోవడానికి, మందులు నిల్వ చేసుకోవడానికి ఫ్రిడ్జ్ చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డా.సుదర్శన్, జీడీనెల్లూరు వైద్యాధికారులు డా.దుర్గాదేవి, మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస మూర్తి, సీహెచ్ఓ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ విడుదల



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న అధికారులు

పుత్తూరు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో గురువారం రాష్ట్ర టెక్నికల్, అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ అసోసియేషన్ 2024 క్యాలెండర్‌ను సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఆనందరావు, కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ కుమార్ విడుదల చేశారు. ఆనందరావు మాట్లాడుతూ పదోన్నతులు, ఇతర సమస్యల పరిష్కారంలో అసోసియేషన్ చురుకైన పాత్ర పోషిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ హనుమంతరావు, సుబ్రమణ్యం, గుణవర్దన్, వికాష్, ప్రసాద్‌రావు, నాగరాజు, రాజేంద్ర, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆడపిల్లల భద్రతపై వ్యాసరచన పోటీలు

గంగాధర నెల్లూరు: విద్యార్థుల్లో విద్యపై దాగి ఉన్న నైపుణ్యాన్ని, ఆలోచనా సరళిని వెలికితీస్తేనే సార్థకత లభిస్తుందని ఎంఈఓ ఆంజనేయులు శెట్టి తెలిపారు. ఆడపిల్లల భద్రతపై మండలంలోని వివిధ స్కూళ్లల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు15 మందికి జీడీ నెల్లూరు హైస్కూల్లో గురువారం వ్యాసరచన వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. మండల స్థాయి పోటీల్లో గెలిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపుతామని ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారి మోహన్‌కృష్ణ

పాలసముద్రం: ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక పీహెచ్‌సీలో ఆశా నోడల్ ఆఫీసర్ సుశీల ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. అనంతరం డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో అంటు వ్యాధులు సోకే అవకాశం ఉందని, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి సీజనల్ వ్యాధులకు ముందస్తుగా మందులు ఇవ్వాలని తెలిపారు. దగ్గు, జలుబు, జ్వరం రెండు మూడు రోజుల పాటు ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ మురళి, సీహెచ్ఓ జ్ఞానశేఖర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అభాగ్యులకు ఆనందమనిపింఛన్

- మాట తప్పని నాయకుడు జగనన్న
- 66.34 లక్షల మందికి రూ.1,968 కోట్లు పంపిణీ
- సీఎంగా మరోసారి జగనన్నను ఆశీర్వదించండి
- పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ఆర్‌కే రోజా పిలుపు





విజయపురం: వైఎస్సార్ పింఛన్ కానుక రూ.3 వేలు అందిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా, పుత్తూరు: పెన్షన్లు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి రోజా

పుత్తూరు: ఇచ్చిన మాటకు కట్టుబడి అవ్వాతాతలకు రూ.3 వేలు పింఛన్ అందిస్తూ మడమ తిప్పని నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి నిలబడ్డారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖా మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. గురువారం ఆమె పుత్తూరు పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో లబ్ధిదారులకు రూ.3 వేలు పింఛన్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ అందరికీ మంచి చేయడమే జగనన్న లక్ష్యమని, ఆ దిశగా రాష్ట్ర ప్రజల కోసం పరితపిస్తుంటారని అన్నారు. నేడు అర్హులైన వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు పింఛన్ నగదు రూ.3 వేలకు పెంచి ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. గతంలో ఎప్పుడైనా ప్రభుత్వ అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు మీ ఇంటి వద్దకే వచ్చి మీ అవసరాలను తీర్చిన దాఖలాలు ఉన్నాయా అంటే అది ఒక్క జగనన్న ప్రభుత్వంలో మాత్రమే సాధ్యమైందన్నారు.

నాడు రూ.వెయ్యి.. నేడు రూ.3 వేలు

గత చంద్రబాబు పాలనలో 39 లక్షల మందికి రూ.వెయ్యి వంతున పింఛన్ అందిస్తూ కేవలం రూ.400 కోట్లు మాత్రమే కేటాయించడం జరిగిందని, అదే నేటి జగనన్న ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 66.34 లక్షల మందికి రూ.3 వేలు వంతున నెలకు రూ.1,968 కోట్లు అందించడం జరిగిందని మంత్రి రోజా తెలిపారు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే ఇది దాదాపు 5 రెట్లు ఎక్కువన్నారు. ఒక్క తిరుపతి జిల్లాలో మాత్రమే 2,74,894 పింఛన్లకు గానూ రూ.81.93 కోట్లు అందిస్తున్నట్లు చెప్పారు. ఒక్క పుత్తూరు మున్సిపాలిటీలో 5,932 మందికి రూ.ఒక కోటి 79 లక్షల 41 వేలు అందిస్తున్నట్లు వివరించారు. బాబు పాలనలో చనిపోతేనే కొత్త పెన్షన్ మంజూరయ్యేదని, అదీ జన్మభూమి కమిటీ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండేదన్నారు. నేడు కులమతాలకు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పెన్షన్లు అందించడం జరుగుతోందని వివరించారు. ఇలాంటి మంచి మనస్సున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. అలాగే మరోసారి నగరి ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి, చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, సింగిల్‌విండో ప్రెసిడెంట్ శ్రీనివాసులురెడ్డి, మైనారిటీ డైరెక్టర్ మాహీన్, కౌన్సిలర్లు హేమలత, కుప్పమ్మ, భానుమతి, ఏకాంబరం, బాలాజీ, నరసింహారావు, చిట్టిబాబు, కెనడీ, నాయకులు లారీమోహన్, మనోహర్‌రెడ్డి, రమేష్‌బాబు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



పుత్తూరులో జరిగిన వైఎస్సార్ పింఛన్ కానుక కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

విశ్వసనీయతకు మారుపేరు జగనన్న..

విజయపురం (నగరి): విశ్వసనీయతకు మారుపేరు అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి, నవరత్నాల్లో భాగంగా సంక్షేమ పథకాలను 100 శాతం అమలు చేశారని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఎంపీడీఓ చంద్రమౌళి అధ్యక్షతన వైఎస్సార్ పింఛన్ కానుకలో భాగంగా పెంచిన రూ.3 వేలు పింఛన్ నగదు పంపిణీని మంత్రి రోజా ప్రారంభించారు.

రూ.62.86 కోట్ల నగదు పంపిణీ ..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో మండలంలో 5,261 మంది అవ్వాతాతలు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.62.86 కోట్ల నగదు పంపిణీ జరిగిందన్నారు. అలాగే వలంటీర్లు తెల్లవారుజామునే లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రమౌళి, తహసీల్దార్ వెంకట్రాయులు, ప్రత్యేకాధికారి మునిలక్ష్మీపతి, ఎంఈఓ ఆంజనేయులు, వైస్ ఎంపీపీ బాలాజీ, ఎంపీటీసీ రాజగోపాల్, సర్పంచ్ మురళీధర్‌రెడ్డి, జబమేరీ, కుమార్, సుధాకర్, భాస్కర్‌రెడ్డి, కుప్పయ్య, పార్టీ కన్వీనర్ గోపీనాథ్, నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న డీవైఈఓ చంద్రశేఖర్

పాలసముద్రం: ప్రభుత్వం పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం తాజా కూరగాయలు, నాణ్యమైన భోజనం పెట్టాలని డీవైఈఓ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చిక్కీలు, రాగా జావ ఇస్తున్నారా ? లేదా ? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డీవైఈఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు మంచి పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో జగనన్న గోరుముద్ద పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రోజుకొక మెనూ, ప్రతిరోజు ఉడికిన గుడు, చిక్కీ ఇవ్వాలని తెలిపారు. మెనూ ప్రకారం, తాజా కూరగాయలు ఉపయోగించుకుని నాణ్యతగా భోజనం చేయాలన్నారు. జగనన్న గోరుముద్ద పథకంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని తెలిపారు. నాడు–నేడు పనుల్లో హెచ్ఎం మనోహర్‌నాయుడు అవకతవకలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నట్లు చెప్పారు. నాడు–నేడు పనుల్లో మంజూరైన నిధులు ఖర్చు చేసిన రికార్డులను డీఈ మధుసూదన్ రావు పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు చేసిన మధ్యాహ్న భోజనాన్ని రుచి చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజేంద్రప్రసాద్, గిరిజ, సీఆర్పీ మునిరాజ్, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఇంటింటికీ శ్రీరాముడి అక్షింతలు



అక్షింతలను ఇంటింటా పంచుతున్న భక్తులు

పాలసముద్రం: అయోధ్య రామమందిరం నుంచి తెచ్చిన శ్రీరాముడి అక్షింతలను పాలసముద్రం బీసీ కాలనీలో గురువారం ప్రతి ఇంటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్య రాముని విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటా రామనామస్మరణ చేస్తూ సాయంకాలం ఇంటి ముందు కొవ్వొత్తులతో దీపారాధన చేయాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చొరవ



రామకృష్ణాపురంలో నిర్మాణంలో ఉన్న తాగునీటి ట్యాంకు

పెనుమూరు(కార్వేటినగరం): గత కొన్నాళ్లుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న రామకృష్ణాపురం, రామకృష్ణాపురం ఎస్టీకాలనీ ప్రజల దాహార్తి తీరుతోందని జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్ అన్నారు. గురువారం ఆయన రామకృష్ణాపురంలో నిర్మాణంలో ఉన్న తాగునీటి ట్యాంకు నిర్మాణాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామకృష్ణాపురం, రామకృష్ణాపురం ఎస్టీకాలనీకి తాగునీటి ట్యాంకు లేదని, దీంతో విద్యుత్ సరఫరా నిలిచినప్పుడు తాగునీటి కోసం మహిళలకు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అయితే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి ఈ గ్రామానికి విచ్చేసినప్పుడు గ్రామస్తులు తాగునీటి సమస్యను విన్నవించారని తెలిపారు. స్పందించిన మంత్రి వెంటనే గ్రామంలో ట్యాంకు నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరించాలని ఉన్నతాధికారులను ఆదేశించారన్నారు. దీంతో గ్రామంలో ట్యాంకు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే ట్యాంకును అందుబాటులోకి తెచ్చి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. సమస్య చెప్పిన వెంటనే స్పందించి, పరిష్కార మార్గం చూపిన ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి తాము ఎప్పుడూ రుణపడి ఉంటామని గ్రామస్తులు తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

- 2 రోజుల్లో 300 మందికి చికిత్స
- కంటిపొర ఆపరేషన్‌కు 60 మంది ఎంపిక



శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నగరి: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కేరోజా చారిటబుల్ ట్రస్టు, శంకరనేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్ర వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభిస్తోంది. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్న ఈ క్యాంపులో రెండు రోజులకు గానూ 300 మందికి వైద్య సిబ్బంది చికిత్సలు చేశారు. వీరిలో కంటి పొర కారణంగా చూపు మందగించిన 60 మందిని మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ ద్వారా మైక్రో స్కోపిక్ స్మాల్ ఇన్‌సిషన్ అనే కొత్త పద్ధతిలో ఆపరేషన్ చేయడానికి ఎంపిక చేశారు. వీరికి ఈ నెల 8న ఆపరేషన్ చేయనున్నట్లు శంకర నేత్రాలయ ప్రతినిధి అరుల్‌కుమార్ తెలిపారు. చికిత్స నిమిత్తం కార్యాలయం వద్ద ఉన్న వారికి భోజన సౌకర్యం కల్పించారు.

పెనుమూరు మండల అధ్యక్షుడిగా విజయకుమార్‌రెడ్డి



పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు మండలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కామసాని విజయకుమార్‌రెడ్డి నియమితులయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా జీ.లోకనాథం, కే.నరసింహులు రెడ్డి, జనరల్ సెక్రటరీలుగా సురేష్‌రెడ్డి, నారాయణ రెడ్డి, టి.జమున, ట్రెజరర్‌గా మధుసూదన్‌రెడ్డి, సెక్రటరీలుగా పలువురిని నియమించారు.

కార్వేటినగరం అధ్యక్షుడిగా శేఖర్‌రాజు



శేఖర్‌రాజు

కార్వేటినగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల కమిటీ నియామకాలు జరిగాయి. పార్టీ కార్వేటినగరం మండల అధ్యక్షుడిగా ఇ.శేఖర్‌రాజును నియమించారు. ఉపాధ్యక్షులుగా జీ.మణి, ధనశేఖర్‌యాదవ్, జనరల్ సెక్రటరీలుగా చంద్రబాబు, జీ.లోకనాథం, జేజేలురెడ్డి, సెక్రటరీలుగా పలువురు నియమితులయ్యారు.

రోడ్లపై చెత్తను వేయరాదు

పుత్తూరు: పురపాలక సంఘ పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో పట్టణ ప్రజలు రోడ్లపై చెత్త వేయరాదని మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపార సంస్థల వద్ద, ఇళ్లలో పోగయ్యే చెత్తను తమ వద్దే డస్ట్‌బిన్లలో సేకరించి ఉంచాలని సూచించారు. మురుగు కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో వేయరాదని స్పష్టం చేశారు.

ఈకేవైసీ పూర్తి చేయండి

శ్రీరంగరాజపురం: 2004 సంవత్సరం కంటే ముందు డీకేటీ పట్టా ఇచ్చిన భూములకు శాశ్వత పట్టా అందించడం జరుగుతుందని తహసీల్దార్ బెన్ను రాజు అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో అధికారులతో ఈ విషయంపై చర్చించారు. వారి వివరాలను సంబంధిత వలంటీర్ల లాగిన్‌లో పొందుపరిచాన్నారు. లబ్ధిదారులు వలంటీర్ లాగిన్‌లో ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు. ఈకేవైసీ చేసుకుంటేనే డీకేటీ భూములను శాశ్వత పట్టాలుగా గుర్తిస్తామన్నారు. డీటీ లోకనాథపిళ్లై, సర్వేయర్ మురళి, వీఆర్ఓ పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో కుంభాభిషేక వేడుకలు

నగరి: నేత్ర దేవతగా ప్రసిద్ధి చెందిన దేశమ్మ దేవత నూతన ఆలయ కుంభాభిషేక వేడుకలు ఫిబ్రవరి 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ చైర్మన్ వేణుబాబు, ఈఓ రామచంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ పునఃనిర్మాణ జీర్ణోద్ధరణ కుంభాభిషేకం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామన్నారు. వేలూరు స్వర్ణ ఆలయ నిర్మాణకర్త నారాయణి అమ్మన్ ఆశీస్సులతో మంత్రి రోజా సమక్షంలో జ్యోతిశాస్త్ర పండితులు రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు కుంభాభిషేక వేడుకలు నిర్వహిస్తారన్నారు. పాలక మండలి సభ్యులు, అర్చకులు ఏ ర్పాట్లను పర్యవేక్షిస్తారన్నారు. చలువ పందిళ్లు, విద్యుత్ అలంకరణ, హోమసామగ్రి సరఫరాకు ఆసక్తిగల వారు ఈ నెల 20న ఉదయం 11 గంటలకు టెండరులో పాల్గొనాలన్నారు. డిపాజిట్ ఫారాలు శుక్రవారం నుంచి తమ కార్యాలయంలో పొందవచ్చన్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం జగనన్న



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: అవ్వాతాతలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ లత అన్నారు. గురువారం మండల పరిధిలోని సీడీ కండ్రిగ గ్రామంలో సర్పంచ్ మంగమ్మ, ఎంపీటీసీ నందిని ఆధ్వర్యంలో పెంచిన పింఛన్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సామాజిక పింఛను సొమ్ము పెంపు విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారని చెప్పారు. దేశంలోని మరే రాష్ట్రంలో లేనివిధంగా ఏపీలో నెలవారీ పింఛన్‌ను రూ.3 వేలకు పెంచి అందజేస్తున్నట్లు తెలిపారు. అవ్వాతాతలకు, దివ్యాంగులకు పింఛను పెంపుతో సంక్రాంతి వేడుకలు ముందే వచ్చినట్లుందని చెప్పారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఏఎంసీ డైరెక్టర్ ఆకుల గోపి, మాజీ సర్పంచ్‌లు గోవిందస్వామి, కుప్పారెడ్డి, నాయకులు లోకనాథనాయుడు, ధన్‌రాజ్, రంగయ్య, రాజారాం, మురళి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్‌ల వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలసముద్రం: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)పై ప్రతి ఓటరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ బాబు తెలిపారు. గురువారం పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ వినాయకం సమక్షంలో ఈవీఎం, వీవీప్యాట్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ బాబు మాట్లాడుతూఓటర్లు తాము ఏ గుర్తుకు ఓటు వేశారో వీవీప్యాట్ యంత్రంలో సరి చూసుకోవచ్చన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కళాశాలల్లో, ప్రతి గ్రామంలో ఈవీఎం, వీవీప్యాట్‌ల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. డీటీ మధుబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి కృషి చేయండి



సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

శ్రీరంగరాజపురం: ప్రతిఒక్కరూ దేశ అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ కష్ణయ్య అన్నారు. మండలంలోని పిల్లారికుప్పం పంచాయతీ గ్రామంలో వికసిత భారత సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల ఆరోగ్యం కోసం ఆయుష్మాన్ పథకాన్ని ప్రవేశపెట్టి ఏడాదికి కేంద్రం రూ.5 లక్షలు, రాష్ట్రప్రభుత్వం రూ.2 లక్షల వరకు మెరుగైన వైద్యం అందిస్తోందన్నారు. అలాగే కేంద్రం పీఎం కిసాన్, ఉపాధిహామీ, జలజీవన్ మిషన్, విశ్వకర్మ వంటి పథకాలు, రాష్ట్రప్రభుత్వం అమ్మ ఒడి, రైతుభరోసా, చేయూత, విద్యాదీవెన, పేదలకు ఇంటి పట్టాలు తదితర పథకాలను అందిస్తున్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 18 రకాల సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తుందన్నారు. అనంతరం నూతన సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పాఠశాల విద్యార్థులు ఆటపాటలతో ప్రజలను అలరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బెన్నురాజు, సర్పంచ్ లోకేష్, మండల వైద్యాధికారి డాక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఎంఈఓ అరుణాచలంరెడ్డి, ఏపీఎం రోజా, నాయకులు జెడ్పీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి, రాజేంద్ర, లోకయ్య, ముత్తుగస్, నాగరాజులుశెట్టి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పెదపాళెమ్మ ఆలయ నిర్మాణానికి సహకారం



భూమి పూజ చేస్తున్న మంత్రి రోజా

విజయపురం (నగరి): విజయపురం ఎస్టీ కాలనీలోని పెదపాళెమ్మ ఆలయానికి మంత్రి ఆర్కేరోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.1.50 లక్షల విలువైన టైల్స్, రూ.25 వేలు విలువైన విగ్రహాన్ని అందించారు. గ్రామస్తుల కోరిక మేరకు అమ్మవారి ఆలయ నిర్మాణానికి మంత్రి రోజా టీటీడీ ద్వారా రూ.10 లక్షలు మంజూరు చేయించారు. గురువారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆలయ ఫ్లోరింగ్‌కు టైల్స్, విగ్రహం కావాలని కోరగా, వెంటనే వాటిని కూడా మంత్రి అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్ గోపీనాథ్, మండల సచివాలయ కన్వీనర్ రాజగోపాల్, సర్పంచ్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

విజయపురం (నగరి): ఆరోగ్యమే మహా భాగ్యమని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరిగా చేయాలని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. గురువారం మండలంలోని పన్నూరులో అంచనా విలువ రూ.55.54 లక్షల వ్యయంతో జిమ్ సెంటర్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ 2019–2023 మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం జాతీయ క్రీడాకారులకు 'వైఎస్సార్ క్రీడా ప్రోత్సాహకం' పథకం ద్వారా 1,806 మంది అథ్లెట్లకు, రూ.9.61 కోట్ల నగదు, అలాగే 24 క్రీడా విభాగాల్లో శాప్ ద్వారా 75 మంది అంతర్జాతీయ క్రీడాకారులకు రూ.8.37 కోట్ల నగదు అందించామన్నారు. అలాగే 33 క్రీడా విభాగాల్లో ప్రాతినిధ్యం వహించిన 51 మంది అంతర్జాతీయ అథ్లెట్లకు, రూ.2.24 కోట్ల నగదు అందించినట్లు ఆమె తెలిపారు. రాష్ట్రంలో 363 శాప్ భవనాలు, క్రీడా స్థలాలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. శాప్ ఈఈ, ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పండగలా పింఛన్ల పంపిణీ



ముడిపల్లిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వృద్ధులు



కావేటిపురం దళితవాడలో..



ఆర్కేవీబీ పేటలో ఆనందం వ్యక్తం చేస్తున్న వృద్ధులు

నగరి: పింఛన్ పంపిణీని పండుగలా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో వలంటీర్లు పెరిగిన పెన్షన్లను వృద్ధులకు అందిస్తుండగా వారంతా ఒక ప్రాంతంలో గుమిగూడి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తూ చల్లగా ఉండాలని దీవిస్తున్నారు. గురువారం మండలంలోని ముడిపల్లిలో ప్రధాన కూడలి వద్దకు చేరిన వృద్ధులంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటాన్ని ఉంచి వరుసగా పాలాభిషేకం చేశారు.

మా మనవడు నిండు నూరేళ్లు చల్లగా ఉండాలి

కార్వేటినగరం: పేదరికంతో అల్లాడుతూ, వయసు మీద పడి ఇబ్బంది పడుతున్న తరుణంలో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ పెంచి రూ.3వేలు అందించిన మా మనవడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని పలువురు వృద్ధులు సీఎం జగన్‌ను దీవించారు.గురువారం మండల పరిధిలోని ఆర్కేవీబీపేటలో పింఛన్ అందుకున్న పలువురు వృద్ధులు మాట్లాడుతూ తాము ఎంతోమంది పాలకులను చూశామని, తమలాంటి వృద్ధులను గతంలో ఎవరూ పట్టించుకో లేదన్నారు. 2019లో సీఎంగా అధికారం చేపట్టిన జగన్ వృద్ధులను, వితంతువులను కళ్లల్లో పెట్టుకుని చూసుకుంటున్నాడని కొనియాడారు. తాము ఊపిరి ఉన్నంత వరకూ సీఎం జగన్‌కు రుణపడి ఉంటామన్నారు. నిత్యం తమ సమస్యలను పరిష్కుస్తున్న వలంటీర్ గిరిబాబును వారు అభినందించారు.

పార్టీలకు అతీతంగా అందించారు

నా పేరు వళ్లియమ్మ, మాది ముడిపల్లి దళితవాడ. నా భర్త బాలవర్తిరాజ భారతీయ జనతా పార్టీ కోసం గత ఎన్నికల్లో పనిచేశాడు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు కూడా వేయలేదు. గతేడాది నా భర్త మరణించారు. ప్రస్తుత ప్రభుత్వం నేను ఏ పార్టీ అని చూడకుండా అర్హత ఆధారంగా నాకు వితంతు పెన్షన్ మంజూరు చేసింది. నేడు వలంటీర్, సచివాలయ సిబ్బంది గ్రామ పెద్దల సమక్షంలో నాకు పెన్షన్ అందించారు. ఈ మేలు నేను మరువను. సీఎం జగన్‌మోహన్ రెడ్డికి నేను ఎప్పుడూ రుణపడి ఉంటా.

ప్రాథమిక స్థాయి నుంచే ఆంగ్లబోధన



డైట్ మోడల్ పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న డీఈఓలు విజయేంద్రరావు, డాక్టర్ శేఖర్

కార్వేటినగరం: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు ఆంగ్లమాధ్యమంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని డీఈఓలు విజయేంద్రరావు, డాక్టర్ శేఖర్ అన్నారు. గురువారం జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్) ఆవరణలోని ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓలు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఆంగ్ల మాధ్యమాన్ని ప్రాథమిక స్థాయి నుంచి ప్రతి విద్యార్థికి ఆంగ్లంలో రాయడం, చదవడం రావాలన్నారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని విద్యార్థులకు మెనూ ప్రకారం విందుభోజనంగా వడ్డించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటిస్తూ ఆంగ్లమాధ్యమంలోని కొన్ని ప్రశ్నలను విద్యార్థులపై సంధించడంతో వారు ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పడంతో డీఈఓలు విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓలు విజయకుమార్, మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.